క్లుప్తంగా

రామ,లక్ష్మణుల అవతారంలో జగన్నాథుడు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఏడవరోజు సోమవారం స్వామివారిని రామ,లక్ష్మణ అవతారంలో అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో గుండిచా మందిరం వద్ద స్వామివారిని అలంకరించారు. మారు రథయాత్ర సమీపిస్తుండడంతో ఆలయప్రాంగణంలో ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారికి రోజువారీ ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. గుండిచా మందిరం వద్దకు గ్రామంలోని భక్తులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామిని దర్శించుకుంటున్నారు. భక్తులచేత అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు.

జగన్నాథునికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో జగన్నాథునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మంగళవారం మారురథయాత్ర సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

జూలై 2న జనరల్ బాడీ



మాట్లాడుతున్న జయకృష్ణ

పార్వతీపురంటౌన్: జూలై 2వ తేదీన రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ నిర్వహిస్తామని రాష్ట్ర ఈసీమెంబర్ పి.జయకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సమావేశం నరసారావుపేటలోని వీవీఆర్ గ్రాండ్‌హోటల్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఎల్‌టీపీలు హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల ఇళ్లకే సరుకులు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ, సర్పంచ్ కృష్ణ

సీతానగరం: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో హాస్టల్ సదుపాయం లేని వారి ఇళ్లకే సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో హాస్టల్‌కు వెళ్లని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బియ్యం, నూనె, గుడ్లు,కందిపప్పు ఐసీడీఎస్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ప్రతిఇంటా విద్యార్థులుండాలని, పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలనే సంకల్పంతో వారిళ్లకే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోందని చెప్పారు. అలాగే పిల్లల ఆరోగ్యంగా ఉన్నప్పుడే నిష్ణాతులైన విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులకు వీలవు తుందని, పౌష్టికాహారం ఇవ్వడం వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అక్కపోలు సింహాచలం, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయ ఉమెన్ పోలీసు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని మంతినివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించి, అక్కడి రికార్డులు, కార్యకర్తల పనితీరును పరిశీలించారు. లబ్ధిదారులకు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం అందివ్వాలని సిబ్బందికి సూచించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలం పెదపెంకి సచివాలయం భైరిపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడం, వారి అభ్యున్నతికి పాటుపడడం సీఎం జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశమని అందుకు నిరంతరం కృషిచేస్తున్నారని చెప్పారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే పారదర్శకమైన పాలన అందించాలనే సంకల్పంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి వారితో పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు చెప్పారు.

ఎవరి ప్రమేయం లేకుండా..

గ్రామస్థాయిలో నాయకుల ప్రమేయం, దళారుల జోక్యం లేకుండా, కార్యాలయాలచుట్టూ ప్రదక్షిణ చేయకుండా ఇల్లు కదలకుండా ఏప్రభుత్వంలో సంక్షేమ పథకాలను పొందారో ప్రజలే గుర్తించాలని కోరారు. ఇంతటి పారదర్శక పాలనతోపాటు కుటుంబంలో అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదో గుర్తించేందుకు, స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు బుక్‌లెట్‌ద్వారా ఎమ్మెల్యే జోగారావు వివరించారు. అర్హులై ఉండి పథకానికి దూరంగా ఉంటే అటువంటి వారు వెంటనే తెలియచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామస్తులు తెలిపిన కొన్ని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీటీసీ సునీత, వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ గంగయ్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ భానుమూర్తి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



ఇంటింటి ప్రచార క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అర్హులైన వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని కొత్తవలసలో నాల్గవ వార్డు సచివాలయంలో ఇంటింటి ప్రచారం క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఇంటిని జల్లెడ పెట్టి ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను జారీచేయడంతోపాటు అర్హులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ రవికుమార్, స్థానిక కౌన్సిలర్ పి.జయంతి, బి.ఆనంద్, కోఆప్షన్ సభ్యులు వెంకటరావుతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు ఆర్థిక సాయం చేయాలి



పోలవరం నిర్వాసితులకు విరాళాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: పోలవరం నిర్వాసితులకు ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ సీపీఎం మండల నాయకులు సోమవారం సీతానగరం మార్కెట్‌లో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములిచ్చినా ఇంతవరకూ పరిహారం చెల్లించక పోవడంతో నిర్వాసితులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ఆర్థిక సహాయాన్ని అందించడానికి చందాలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. చందాల ద్వారా వసూలు చేసిన సొమ్మును బాధితకుటుంబాలవారికి సీపీఎం అందజేస్తుందని తెలిపారు.

దాతలు విరివిగా విరాళిచ్చి నిర్వాసితులకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి వెంకటరమణమూర్తి, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జీవీ రమణ, అసంఘటిత కార్మిక సంఘం నాయకులు శంకరరావు, రమణ పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పక్కాగా ఉండాలి

• డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు

సీతానగరం: రోగ నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని మరిపివలసలో పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 సంచార వైద్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు చేస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్యపరీక్షలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున రోగ నిర్ధారణ పక్కాగా నిర్వహించి నివారణకు అవసరమైన మందులు ఇవ్వాలని సూచించారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు,గుర్తిస్తే వెంటనే చికిత్స అందంచాలని చెప్పారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులందరికీ ఆరోగ్య తనిఖీలు విధిగా చేపట్టాలని, ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్యసేవలు అందించాలని తెలిపారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ మరిపివలసలో నిర్వహించిన వైద్యశిబిరంలో 65 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయాగౌడ్, వైద్య సిబ్బంది గౌరి, శ్రావణి, చంద్రినాయుడు, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్ ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పాడి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు



పాడి పశువుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న కేవీకే సమన్వయకర్త టీఎస్ఎస్‌కే పాత్రో

పార్వతీపురం: పాడి ఉత్పత్తిని పెంచేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామని కేవీకే సమన్వయకర్త డాక్టర్ టీఎస్ఎస్‌కె పాత్రో అన్నారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషివిజ్ఞాన కేంద్రం రస్తాకుంటుబాయి శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కోటవానివలస, ఇంగనాపురం, లక్ష్మీపురం గ్రామాలను సందర్శించి రైతులకు అవసరమైన సలహాలు ఇచ్చారు. గేదెల్లో పాల ఉత్పత్తి పెరగడం కోసం ప్రోబయోటిక్, ఖనిజలవణ మిశ్రమాలను అందజేశారు. పశువుల్లో బాహ్య పరాన్న జీవుల నిర్మూలన కోసం ఔషధమొక్కల నుంచి కషాయాన్ని తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కషాయం పశువుల శాలలు, పాకల మీద పిచికారీ చేస్తే బాహ్య పరాన్నజీవులు పోతాయన్నారు. కార్యక్రమంలో కేవీకే పశుసంవర్ధకశాఖ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అను, సిబ్బంది ఉన్నారు.

ఆదర్శపాఠశాలలో మిగులు సీట్ల భర్తీ

సాలూరు: మండలంలోని పురోహితుని వలస ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంజలి దేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.పాఠశాలలో 7వ తరగతిలో 18 సీట్లు,8వ తరగతిలో 15 సీట్లు,9వ తరగతిలో 10 సీట్లు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు పాఠశాలకు నేరుగా స్టడిసర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ కాపీలను తీసుకువచ్చి ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్షలో మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన సీట్లు భర్తీచేయనున్నట్లు వివరించారు. ప్రవేశపరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

అంబేడ్కర్ విద్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ

సీతానగరం: మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఈశ్వరరావు సోమవారం ఒకప్రకటనలో తెలియజేశారు. సీతానగరం మండలం జోగింపేట విద్యాలయంలో 6,7,8,9 తరగతుల్లో గల పరిమిత ఖాళీ సీట్ల కోసం ఈనెల 28 సాయంత్రంలోగా విద్యార్థికి సంబంధించిన ఆధార్ నంబర్, స్టడీ ధ్రువీకరణ పత్రం తెచ్చుకుని పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఆయా సీట్ల భర్తీకి ఈ నెల 30 ఉదయం 10 గంటలకు విద్యాలయంలో అర్హత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

అందుబాటులోకి అంబులెన్స్ సేవలు

సీతంపేట: ఏజెన్సీలోని కొన్ని ప్రాంతాల్లో అంబులెన్స్ సేవలు లేకపోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. ఇదే విషయమై అంబులెన్స్ డ్రైవర్లతో ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయ పార్వతి సోమవారం అత్యవసర సమావేశమై, తక్షణమే అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ మేరకు బాధిత ప్రాంతాల్లో అంబులెన్స్ సేవలను పునరుద్ధరించారు.

డ్రాపౌట్స్ లేకుండా చర్యలు



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: డ్రాపౌట్స్(బడి మధ్యలో మానేసిన పిల్లలు) లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి సూచించారు. సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఆమె విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లకూడదని తెలిపారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్యనందిస్తోందన్నారు. గతేడాది పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించామని తెలిపారు. తరచూ విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్లడం ద్వారా చదువుపై వారికి ఆసక్తి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. జగనన్న అమ్మఒడి పథకం నిధులను విద్యార్థుల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.

'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్

పాలకొండ: మండలంలోని కొండాపురంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, సోమవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఏపీఓ ఈశ్వరమ్మ, సోషల్ ఆడిట్ రిసోర్స్ పర్సన్ తిరుపతిరావు, డీఆర్‌పీ కృష్ణప్రసాద్ వేతనదారులతో మాట్లాడి, ఇంతవరకు చేపట్టిన పనులపై ఆరాతీశారు. దాదాపు రూ.28 లక్షల నిధులతో చేపట్టిన పనుల్లో 340 మందికి 100 రోజుల పాటు పని కల్పించినట్లు పేర్కొన్నారు.

పాస్‌బుక్ ప్రింటర్ సేవలు ప్రారంభం



పాస్‌బుక్ ప్రింటర్ సేవలను ప్రారంభిస్తున్న జిల్లా బ్యాంకు మేనేజర్ వెంకటరమణ

గరుగుబిల్లి: మండలంలోని కొంకడవరం గ్రామంలో ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) ఆధ్వర్యంలో పాస్‌బుక్ ప్రింటర్ సేవలను సోమవారం ప్రారంభించారు. జిల్లా బ్యాంకు మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ బ్యాంకు సేవలను సులభతరం చేసేందుకు ఏపీజీవీబీ గ్రామాల్లో ఈ సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఇకనుంచి పాస్‌బుక్ ప్రింట్, అప్‌డేట్ కోసం బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వీవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలుతో విద్యాభివృద్ధికి ప్రోత్సాహం



ఆణిముత్యాలుకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం విద్యాభివృద్ధికి దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో 2023 విద్యాసంవత్సరంలో జరిగిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లీష్‌మీడియంలోఅత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు, తెలుగు మీడియంలో అత్యధికమార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంట్లో విద్యాకుసుమాలు విలసిల్లాలని, సమాజానికి సేవలందించే విద్యను ప్రోత్సహించడానికి అమ్మ ఒడి,విద్యా కానుక, వసతిదీవెన, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యాదీవెన తదితర పథకాలతో అవసరమైన నిధులు విడుదల చేస్తోందన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో తెలుగుచ ఇంగ్లీష్ మీడియంలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులుగా ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తేరేజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి.సూర్యనారాయణ, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శంకరరావు

సాలూరు: జూలై నెల 1వ తేదీ నుంచి మున్సిపాలిటీలో జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శంకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించే తేదీకి వారం రోజుల ముందు నుంచి సదరు సచివాలయం పరిధిలో వలంటీర్లు యాప్‌లో జగనన్న సురక్ష సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. వలంటీర్లందరూ తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి శతశాతం సర్వే చేయాలని తెలిపారు. అర్హులెవరైనా ఏవైనా కారణాల వల్ల పథకాలు అందలేదని తెలిపితే వాటి వివరాలు, వారికి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు అవసరమైతే వాటిని ఉచితంగా క్యాంప్ రోజు సచివాలయంలో ఇవ్వనున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించాలని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 29న పట్టణంలో వెలమపేట సీతారామ కల్యాణ మండపంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారని, దానిని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సచివాలయ మున్సిపల్ కన్వీనర్, కౌన్సిలర్ గిరి రఘు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు పాటుపడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

బలిజిపేట: కుష్ఠువ్యాధి నిర్మూలనకు అందరం పాటుపడదామని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి కోరారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బలిజిపేట పీహెచ్‌సీ నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలను ప్రజలకు తెలియపరిచారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశాఖను సంప్రదించాలని సూచించారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు స్పర్శకోల్పోవడం, ముక్కులో రక్తం కారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఎటువంటి అనుమానం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన వైద్యాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

• అనర్థాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్

సీతానగరం: ప్రజలకు హాని కల్గిస్తున్నందున నిషేధించిన మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఈబీ ఉన్నతాధికారుల చెప్పిన విషయాలను విద్యార్థులు అవగాహన కల్పించుకుని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఈబీ) ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.ధర్మరాజు అధ్యక్షతన మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే అనర్థాలు, ఆరోగ్య పరమైన సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు మాదక ద్రవ్యాల వాడకంతో గుండె సంబంధిత, క్షయ, టీబీ, క్యాన్సర్ తదితర ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడి యుక్తవయస్సులోనే తనవు చాలిస్తున్నారని అన్నారు. ఈ మేరకు మాదకద్రవ్యాల వాడకంతో వచ్చే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కల్పించుకుని గ్రామాల్లో ప్రజలకు విరామ సమయంలో తెలియజేయాలని కోరారు. అలాగే భవిష్యత్‌లో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలి



అంటిపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ వలంటీర్లు, గృహసారథులు సమగ్రంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ పర్యవేక్షణలో రెండవరోజు అంటిపేట, బగ్గందొరవలస గ్రామాల్లో జరిగిన సర్వేను వారు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎ. నారాయణరావు, ఎస్ సుశీల, బి.తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, ఎస్ రామకృష్ణ, బక్కు సూర్యనారాయణ, ఎంపీటీసీలు, కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.